క్లుప్తంగా

జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందించాలి



ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శివనాగజ్యోతికి సమస్యలను వివరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని కాంగ్రెస్ పార్టీనాయకుడు వి.దాలినాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శివనాగజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషిచేయాలని కోరారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, మాతా, శిశుమరణాలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఆస్పత్రి నుంచి రిఫర్ కేసులు తగ్గేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యవసర సేవల విభాగంలో అందుబాటులో వైద్యులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం, చిన్నపాటి మరమ్మతులు చేపట్టి ఆస్పత్రిని మరింత అభివృద్ధి పథలోకి తీసుకువెళ్లేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్. సాయిశ్రీనివాస్, టి. గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

కొమరాడ: మండలంలోని కూనేరురామభద్రపురం, కొమరాడ, కొట్టు, కొరిశీల, నిమ్మలపాడు, కళ్లికోట ప్రాంతాల్లోని నాగావళి నదీ తీరంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని మంగళవారం సాక్షి దినపత్రికలో 'ఇసుక తవ్వేస్తున్నారు..' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా మైనింగ్ అధికారుల బృందం ఆకస్మికంగా కూనేరురామభద్రపురం ఇసుక ర్యాంప్‌ను తనిఖీ చేసి, ఓ ఇసుక లారీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదే విషయాన్ని స్టేషన్ రైటర్ రాజారత్నం తెలిపారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వృత్తి విద్య కోర్సులు చేసిన వారికి ఉపాధి అవకాశాలు అపారమని కురుపాం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి తెలిపారు. అదే పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆమె చేతులమీదుగా మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థులకు ఉపాధి, స్వయం ఉపాధి కలిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందని, ఉన్న అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ముగిసిన శిక్షణ



విద్యార్థులు సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి లక్ష్మణరావు

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిత్యజీవితానికి అన్వయించుకుని, ఉపయోగపడేలా చూసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు అన్నారు. సమాజ సమస్యలు పరిష్కరించే ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్, సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్‌సీ సంస్థలు సహాయం చేస్తున్నాయన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల్లో ఎరువు తయారు చేయాలి



చినగుడబలో క్లాప్‌మిత్రలకు సూచనలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ, వల్లరగుడబ గ్రామాల ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)లను ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం చెత్త నుంచి ఎరువుల తయారీపై క్లాప్‌మిత్రలకు అవగాహన కల్పించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయాలని, అదే ఎరువును రైతులకు సబ్సిడీపై అందిస్తున్న పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చవచ్చన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు పండిస్తే పంటలు బాగా పండడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని అలాగే నేల సారవంతమవుతుందన్న విషయాలను అందరికీ తెలియజేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఆర్.గోవిందరావు, కార్యదర్శి టి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ చేసేదెప్పుడు?



పదమాయవలసలో రోడ్డు పక్కనే ఉన్న పెంటకుప్పలు, చెత్తచెదారాలు



సచివాలయాల్లో మూలనపడి ఉన్న ఫాగింగ్ యంత్రాలు

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- దోమలు విజృంభిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువు
- పంచాయతీల్లో మూలన పడిన మెషీన్లు

బలిజిపేట: గ్రామాల అభివృద్ధికి సెక్రటరీలు బాధ్యతగా పనిచేయాలి, దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రజలు రోగాల బారినపడకుండా చూడాల్సిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించండని తరచూ మండల పరిషత్ అధికారులు వల్లెవేసే మాటలివి. కానీ ఆచరణలో మాత్రం శూన్యం. 24పంచాయతీలు, 20సచివాలయాలు ఉన్న బలిజిపేట మండలంలో దోమలను నిర్మూలించే ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా అటకెక్కించారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడచూసినా పారిశుద్ధ్య లోపం తాండవిస్తోంది. రోడ్ల పక్కనే చెత్తచెదారాలు పేరుకుపోయి ఉన్నాయి. వీధి కాలువలు మురుగునీటితో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. నివాసగృహాల్లో నివసించే ప్రజలు దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. చినుకుపడితే వీధికాలువలు నిండి మురుగునీరు వీధుల్లోకి ప్రవహిస్తోంది. మురుగునీరు, చెత్తచెదారాలపై వాలిన దోమల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోకపోవడం, మొక్కుబడిగా పారిశుద్ధ్య పనులు చేయడం, మురుగునీటి కుంటల్లో పైరిత్రం పిచికారీ చేయకపోవడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

తుప్పుపట్టిపోతున్న ఫాగింగ్ యంత్రాలు

ప్రతి పంచాయతీకి ఫాగింగ్ మెషీన్ కొనుగోలు చేసినప్పటికీ దోమల నిర్మూలన చేయాల్సి ఉండగా మండల, గ్రామస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మూలకు చేరాయి. గ్రామాల్లో కనీసం 10రోజులకు ఒకసారి ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. మురుగు కాల్వలు, చెత్తకుప్పల్లో దోమలు ఉత్పత్తి అయి జనాలపై దాడులు చేస్తున్నాయి. దోమల నిర్మూలన చేయాల్సిన మెషీన్లు, పైరిత్రం పిచికారీ చేయకుండా గ్రామాలను వదిలేశారు.

దోమలమందు స్ప్రే చేయిస్తున్నాం

గ్రామాల్లో దోమలమందు స్ప్రే చేయిస్తున్నాం. ఫాగింగ్ యంత్రాలు మరమ్మత్తుల్లో ఉన్నాయి. ఆర్థిక భారంవల్ల వాటికి మరమ్మతులు చేయించడానికి అవడం లేదు. పారిశుద్ధ్యపనులు చేయిస్తున్నాం.

– పుష్పారావు, ఈఓపీఆర్‌డీ, బలిజిపేట

గ్రామాల్లో శానిటేషన్ అట

గ్రామాల్లో శానిటేషన్ పనులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఎక్కడ చూసినా దుర్గంధమే. గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు. అయినప్పటికీ పారిశుద్ధ్య సమస్య పరిష్కారం జరగడం లేదు. తడిచెత్త, పొడిచెత్త, చెత్తనుంచి సంపద అంటున్నారు. అది ఎక్కడా కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చెత్తనుంచి సంపద తయారు చేయాలి



పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో మాట్లాడుతున్న డీపీఓ ఎస్ కొండలరావు

సీతానగరం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా ఎరువు తయారుచేయడానికి ప్రాధాన్యం ఇచ్చి పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు తోడ్పడాలని డీపీఓ కొండలరావు ఆదేశించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని సూరంపేట, గుచ్చిమి, పెదబోగిలి ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణను ఈఓపీఆర్డీ కె.కుమార వర్మతో కలిసి మంగళవార ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూరంపేట పంచాయతీ పరిధిలో ఉన్న చిన్నారాయుడుపేట, మరిపివలస, సూరంపేట గ్రామాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రీన్‌అంబాసిడర్లు వీధుల్లో సేకరించిన తడిచెత్త, పొడిచెత్తను ఎస్‌డబ్ల్యూపీసీల్లో వేరుచేసిన చెత్తను ఎరువుగా ఉత్పత్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని, ఎరువు తయారీకి అసరమైన వనరులు వేతనదారులను ప్రత్యేకించామని తెలిపారు. పంచాయితీ కార్యదర్శులు గ్రీన్‌అంబాసిడర్లతో చెత్తనుంచి సంపద తయారీకి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే సూరంపేట వీధుల్లో నిర్వహించిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఎంఈవో శ్యామ్ సుందర్, ప్రిన్సిపాల్ స్వర్ణలత

మక్కువ: చదువుతో పాటు, సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లను మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలత మంగళవారం అందజేశారు. మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన పదవ తరగతి, ఇంటర్ ఒకేషనల్ విద్యా ర్థులకు పబ్లిక్ పరీక్షల తరువాత సెలవుల్లో ప్రత్యేక ఇంటర్న్ షిప్‌పై 12 రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత వృతి విద్య ప్రాధాన్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులు సమాజంపట్ల అవగాహన పెంపొందించుకుని, జీవితంలో స్థిరపడేందుకు ఇంటర్న్‌షిప్ దోహదపడుతుందని, సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, వృత్తివిద్యపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్యాంసుందర్, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.భారతి, ఒకేషనల్ ఉపాధ్యాయులు ముత్యాలమ్మ, గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

పాలకొండ: పాలకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి సారా రవాణ జరుగుతన్న విషయమై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అన్ని ప్రధాన రహదారులతో పాటు ఏజెన్సీ గ్రామాల నుంచి సారా రవాణాకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో దారి కాపల ఏర్పాటు చేశామని తెలిపారు. పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని వివరించారు. బెల్లం వ్యాపారులకు ఇప్పటికే అవగాహన కల్పించి తగిన సూచనలు చేశామన్నారు. సారా తయారీ, రవాణా చేసేవారు తమ తీరు మార్చుకోకపోతే పీడీ యాక్టు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు.

నవధాన్యాల విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



నవధాన్యాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

సీతంపేట: నవధాన్యాల విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని ఏటీ మన్మథరావు తెలిపారు. కుశిమిగూడలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీటిని మంగళవారం ప్రదర్శించారు. రైతులకు పంపిణీ చేశారు. నవధాన్యాల వల్ల పంట భూమి ఆరోగ్యంగా ఉండి నేల సారవంతంగా ఉంటుందన్నారు. సేంద్రీయ కర్బనం పెరుగుతుందన్నారు. రసాయన మందులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఏఓ విమల, మునలయ్య, ఎం.నరేష్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

నమ్ముకున్న వారికి అండగా వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట దివంగత సర్పంచ్ చింతాడ కృష్ణ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, లచ్చయ్యపేట సర్పంచ్ కృష్ణ కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించి ఇద్దరు పిల్లల్ని ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ చిన్నవయస్సులోనే తల్లిని కోల్పోయిన సర్పంచ్ పిల్లలు చైతన్య కుమార్, లాలిత్యలను కృష్ణ తల్లిలేని లోటును తీరుస్తూ ప్రజలకు సేవలందించాడని కొనియాడారు. కృష్ణపై ఉన్న నమ్మకంతో రాజ్యాంగ పరంగా సంక్రమించిన సర్పంచ్ పదవికి ఏకగ్రీంగా ఎన్నుకున్నారని, సభ్యుల సహకారంతో సేవలందించారన్నారు. కృష్ణ మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటన్నారు. దివంగత సర్పంచ్ కృష్ణ పిల్లల్ని పార్టీ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఓదార్చిన వారిలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీటీసీలు సింహాచలం, తిరుపతిరావు, ఆర్‌వి పార్థసారథి, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్థానిక నాయకులు ఉన్నారు.

జర్నలిస్టుల ఐక్యత కోసం సంఘాలు అవసరం

సాలూరు: జర్నలిస్టుల ఐక్యత కోసం సంఘాల అవసరం ఉందని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం సాలూరు పట్టణంలో సీనియర్ జర్నలిస్టు కోట్ల లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి జర్నలిస్టుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, అక్రిడిటేషన్లు, ఇళ్లస్థలాలు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మహాసభలు విశాఖపట్నంలో నిర్వహించే అవకాశం ఉందని, జర్నలిస్టులపై దాడుల నేపథ్యంలో అందరం సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సింహాద్రి, ఇతర జర్నలిస్టులు శంకరరావు, శ్యాం, రామారావు, జార్జ్, ఈశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నిక

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా తాడ్డి కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పోలినాయుడు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

దాడివెనుక రాజకీయ ఒత్తిడి లేదా?



- కమ్యూనిస్టులను తప్పబట్టడం సరికాదు
- సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన బంటువానివలసలో నిర్మించుకున్న ఇంటిగోడలు, చెట్లను ఆదివారం పోలీసులు, తహసీల్దార్ సమక్షంలో కూల్చివేయడం దాడి వెనుక రాజకీయ ఒత్తిడి లేదంటారా? అని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ ఒత్తిడి కారణంగానే రెవెన్యూ అధికారులు, పోలీసులు నిర్వాసితుల భూములపై బుల్డోజరుతో దాడి చేశారన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల చర్యలను అడ్డుకునే ప్రయత్నం చేసిన నిర్వాసితులపై బైండోవర్ కేసులు నమోదు చేశారన్నారు. ఈ దాడిపై చర్య తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌కు ఒక వ్యక్తి వచ్చి కూల్చివేత ప్రక్రియ చట్టబద్ధంగానే జరిగిందని, ఎమ్మెల్యే విజయచంద్రకు ఎలాంటి సంబంధంలేదని పేర్కొనడం ఎంత వరకు సమంజసమన్నారు.

కూల్చివేత ప్రక్రియలో ఎమ్మెల్యే పాత్రపై సంబంధిత ఎమ్మెల్యే ఖండించాల్సి ఉన్నప్పటికీ ఆత్మరక్షణలో భాగంగా గానే ఎమ్మెల్యే పాత్రపై ఒక సాధారణ వ్యక్తి ఖండించాడన్నారు. కబ్జాకు సంబంధించి తహసీల్దార్, ఆర్డీఓ స్థాయి అధికారులు తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితుల పోరాటం ఫలితంగా దక్కించుకున్న ఇంటి స్థలాలను అధికారులు ఆక్రమించుకుంటే మరో పోరాటం చేయాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు.

ఉపాధి వేతనదారుల ధర్నా



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు



బలిజిపేట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వేతనదారులు

- బకాయి వేతన బిల్లులు చెల్లించాలని డిమాండ్

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ఉపాధి వేతనదారులకు చెల్లించవలసిన బిల్లుల బకాయిలు చెల్లించనందుకు నిరసనగా చినభోగిలి సచివాలయం ఎదుట వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 2వ వారం నుంచి వేతనదారులకు పనులు కల్పించినా బిల్లులు నేటికీ చెల్లించక పోవడంతో పనులు చేసినా వారికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదన్నారు 12 వారాల బిల్లులు చెల్లించాల్సిన ప్రభుత్వం ఇంతవరకూ స్పందించక పోవడం వల్ల రోజుకో పర్యాయం సచివాలయాల ఎదుట ఉపాధి వేతనదాలరుతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. ఉపాధిహామీ చట్ట ప్రకారం పనిచేసిన 2 వారాలకే బిల్లులు చెల్లించాలని మార్గదర్శకాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. బకాయి బిల్లులు చెల్లించే వరకూ ఆందోళన కార్యక్రమాలు దశలవారీగా జరుగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు లక్ష్మణరావు, చుక్క గణేష్, రామినాయుడు, పార్వతి, చిన్నమ్మి, రామలక్ష్మి, పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: ఉపాధి వేతనదారులకు బిల్లులు చెల్లించాలని, పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెదపెంకిలో ఉపాధిపనులు కల్పించాలని, ఎన్ఎంఎంఎస్ యాప్ రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ వేతనదారులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో సీపీఎం సీనియర్ నాయకుడు మన్మథరావు, వ్యవసాయం కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటస్వామిలు పాల్గొని మాట్లాడుతూ పెదపెంకిలో సువర్ణ బందలో గత వారం 8గ్రూపులకు చెందిన సుమారు 300మంది పనిచేశారని దానికి సంబంధించిన మస్టర్ కార్యాలయానికి ఇస్తే పేమెంట్ జనరేట్ చేయకుండా రిజక్ట్ చేశారని దీనివల్ల వేతనదారులు నష్టపోతున్నారన్నారు. అదేవిధంగా రెండుపూటలా పనులు కాకుండా ఒంటిపూటే పని ఏర్పాటు చేయాలని, 200రోజులు ఉపాధిపనులు కల్పించి, కనీస వేతనం రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నగేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో వేతనదారులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు



రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన ప్రత్యేక అవసరాలు గల క్రీడాకారులు

సీతానగరం:

రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడలపోటీల్లో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దుర్గా ప్రసాద్ సిల్వర్‌మెడల్ సాధించాడని హెచ్ఎం ఇల్లా ప్రసన్న లక్ష్మి తెలియ జేశారు. ఈ మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఆమె మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపియాడ్ భారత్‌కమిటీ ఆధ్వర్యంలో హిల్‌ప్యారడైజ్ స్కూల్ అగిరిపల్లి నూజివీడులో ఈ నెల 21 నుంచి 23 వతేదీవరకూ పోటీలు జరుగనున్నాయని తెలిపారు. ప్రజ్ఞావైకల్యం, డౌన్ సింగ్రోం, మస్తిష్కపక్షవాతం వైకల్యాలుగల ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు జరుగుతున్న పోటీల్లో మన్యం జిల్లా నుంచి అయిదుగురు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మొదటి రోజున జరిగిన క్రీడా పోటీల్లో సీతానగరం ఉన్నత పాఠశాలకు చెందిన బోను దుర్గా ప్రసాద్ 100 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్‌మెడల్ సాధించాడని చెప్పారు. 9వ తరగతి చదువుతున్న దుర్గా ప్రసాద్ విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభకనబర్చినందుకు పాఠశాల హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఒకేషనల్ ధ్రువపత్రాల పంపిణీ



ధ్రువపత్రాలతో ఒకేషనల్ విద్యార్థులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఒకేషనల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు మంగళవారం పంపిణీ చేశారు. గత 12 రోజులుగా ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి గ్రామాల్లో ఇంటెర్న్‌షిప్ పూర్తి చేసిన 69 మందికి ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీఎంసీ చైర్మన్ వానపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ మండల ధనలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు చేతుల మీదుగా అందించారు. ఒకేషనల్ టీచర్లు సీహెచ్ హరిప్రసాద్, కె.మాధవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.